క్లుప్తంగా

హోటల్ సీజ్



సీజ్ చేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారి అనూష

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తాలోని ఓ హోటల్‌లో మూడు రోజుల క్రితం కొంత మంది వ్యక్తులు టిఫిన్లు చేయగా అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, విరేచనాలు కావడంతో వెంటనే ఆస్పత్రిలో చేరారు. దీంతో ఫుడ్ సేఫ్టీ అధికారికి ఫిర్యాదు చేయగా బుధవారం తనిఖీ చేపట్టి వెంటనే హోటల్‌ను సీజ్ చేసినట్లు ఫుడ్ సేఫ్టీ అధికారి అనూష తెలిపారు.

మత్తు పదార్థాల బారిన పడొద్దు



మాట్లాడుతున్న డీఎస్పీ రఘుచందర్

జగిత్యాల: విద్యార్థులు చెడు అలవాట్లకు, చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాల బారిన పడకూడదని డీఎస్పీ రఘుచందర్ అన్నారు. బుధవారం ఓల్డ్ హైస్కూల్‌లో భౌతిక, రసాయన శాస్త్ర ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయుల చేతుల్లోనే విద్యార్థుల భవిష్యత్ ఉందన్నారు. విద్యార్థులను చెడు అలవాట్లు, చెడు స్నేహాలకు దూరంగా ఉంచేలా చూడాలన్నారు. ఈ మధ్యకాలంలో మత్తు పదార్థాలకు బానిస అవుతున్నారని, వాటి జోలికి వెళ్లకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు శ్రీనివాస్‌రావు, చంద్రశేఖర్, రాజ్‌కుమార్, జగదీశ్వర్, కృష్ణసాయి పాల్గొన్నారు.

సీఎం, మంత్రులు, విప్ చిత్రపటాలకు క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కథలాపూర్: వేములవాడ నియోజకవర్గానికి యంగ్ ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు కావడంపై కథలాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు క్షీరాభిభిషేకం చేశారు. 25 ఎకరాల విస్తీర్ణంలో ఈ స్కూల్ నిర్మించడానికి ప్రభుత్వం రూ. 200 కోట్లు మంజూరు చేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు, నాయకులు తొట్ల అంజయ్య, ఎం.డీ అజీమ్, పులి హరిప్రసాద్, కల్లెడ గంగాధర్, రాధాకృష్ణ, లింగంగౌడ్, గంగాధర్, మోహన్ పాల్గొన్నారు.

సావర్కర్‌కు నివాళి



సావర్కర్ చిత్రపటానికి నాయకుల నివాళి

జగిత్యాలటౌన్: హైందవ సమాజాన్ని జాగృత పరిచిన మహనీయుడు వీడీ సావర్కర్ అని భారత్ సురక్షా సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీఎస్ రాజు అన్నారు. సావర్కర్ జయంతి సందర్భంగా తహసీల్ చౌరస్తాలో భారత్ సురక్షాసమితి నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో భారత సురక్షాసమితి జిల్లా అధ్యక్షుడు అక్కినపెల్లి కాశీనాథం, చిట్ల గంగాధర్, దొండపాటి జనార్దన్‌రెడ్డి, బండి సత్యనారాయణ, మామిడాల రాములు, అరుణ్, బిట్టు తదితరులు పాల్గొన్నారు.

ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి రావాలని పూజలు



కథలాపూర్: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి రావాలని మండలంలోని భూషణరావుపేట మర్రవ్వ ఆలయంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం పూజలు చేశారు. దేవుడికి కొబ్బరికాయలు కొట్టి, పూలు, పాలతో దేవుడికి అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు అంబటి రాధాకృష్ణ, నాయకులు తలారి మోహన్, మహేశ్, రమేశ్‌నాయక్, అంజయ్య పాల్గొన్నారు.

నిధులున్నా.. పనులు సున్నా..

- నత్తనడకన బల్దియా భవన నిర్మాణ పనులు
- అద్దె భవనంలో మున్సిపల్ కార్యాలయం
- పట్టించుకోని అధికారులు



అద్దె భవనంలో మున్సిపల్ భవనం



కొనసాగుతున్న భవన నిర్మాణపనులు

రాయికల్: రాయికల్ మున్సిపల్ భవన నిర్మాణ పనులు నత్తకనడకన సాగుతున్నాయి. పట్టణ శివారులోని ఓ అద్దె భవనంలో మున్సిపల్ భవనాన్ని ఏర్పాటు చేసి పట్టణ ప్రజలకు సేవలందిస్తున్నారు. తాత్కాలిక కార్యాలయం పట్టణ శివారులో ఉండటంతో వివిధ సేవల కోసం వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుమారు రెండేళ్లు అయినప్పటికీ శాశ్వత భవన నిర్మాణ పనులు మాత్రం పూర్తి కావడం లేదు.

నత్తనడకన సాగుతున్న పనులు

రాయికల్ గ్రామపంచాయతీగా ఉన్న సమయంలో శిథిలావస్థలో ఉన్న గ్రామపంచాయతీ భవనాన్ని తొలగించి నిర్మాణం చేపట్టేందుకు 2023లో టీయూఎఫ్ఐడీసీ నిధుల ద్వారా రూ.1.20 కోట్లతో మున్సిపల్ భవనానికి నిధులు మంజూరు చేశారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ ఆరునెలల్లోపు జీప్లస్ 2 భవనం నిర్మించాల్సి ఉండగా, సుమారు రెండేళ్లు గడుస్తున్నప్పటికీ పనులు సకాలంలో పూర్తి చేయలేదు. ఇదీ గాకా చేసిన పనుల్లో కూడా నాణ్యత గా లేదని ఆరోపణలు వస్తున్నాయి. తాత్కాలికంగా పట్టణ శివారులోని ఓ భవనాన్ని అద్దెకు తీసుకుని మున్సిపల్ భవనాన్ని కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ స్పందించి మున్సిపల్ భవన నిర్మాణ పనులు వేగవంతంగా, నాణ్యతగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని బల్దియా ప్రజలు కోరుతున్నారు.

కార్యాలయానికి వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది



రాయికల్ బల్దియా ప్రజలకు అందుబాటులో ఉండేలా మున్సిపల్ భవనాన్ని సకాలంలో పూర్తి చేయాలి. పట్టణ శివారులో తాత్కాలికంగా ఉన్న కార్యాలయంలోకి వెళ్లాలంటే పట్టణ ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. పట్టణానికి సుమారు అర కిలోమీటరు దూరంలో తాత్కాలిక భవనాన్ని ఏర్పాటు చేశారు. ఇప్పటికైనా పట్టణంలో అందరికీ అందుబాటులో ఉన్న మున్సిపల్ భవనాన్ని పూర్తి చేయాలి.

– వాసం ప్రసాద్, రాయికల్

కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తెస్తున్నాం



రాయికల్ మున్సిపల్ భవనాన్ని పూర్తి చేసేలా సంబంధిత కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తెస్తున్నాం. ఎండాకాలంలో నీటి కొరత ఉండటంతో కొంత వరకు జాప్యం ఎదురైంది. పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు చేపడుతున్నాం.

– మనోహర్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్

తడిసిన ధాన్యంపై ఆందోళన వద్దు

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



ధాన్యం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

సారంగాపూర్: వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లో వరిధాన్యం తడిసిపోయిందని, దీనిపై రైతులు ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. బీర్‌పూర్ మండలం కందెనకుంట, చర్లపల్లి, నర్సింహులపల్లె గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. తడిసి ధాన్యంను ఎలాంటి కోతలు లేకండా కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని, ఇప్పటికే దీనిపై జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులతో మాట్లాడినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆయన వెంట కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు, నాయకులు నారపాక రమేశ్, రిక్కల ప్రభాకర్, సుషీన్, నరేందర్, సంతోష్, రైతులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అమెరికాలో 'కొప్పుల'కు ఘన స్వాగతం



కొప్పులకు స్వాగతం పలుకుతున్న ఎన్నారైలు

ధర్మపురి: అమెరికాలోని డల్లాస్‌లో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు ఎన్నారైలు బుధవారం ఘన స్వాగతం పలికారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 1,2 తేదీల్లో జరిగే బీఆర్ఎస్ 25 ఏండ్ల రజతోత్సవ వేడుకల్లో పాల్గొనడానికి మాజీ మంత్రి అమెరికాలోని డల్లాస్‌కు వెళ్లగా, ఎన్నారైలు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, రాష్ట్ర మాజీ పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్ దామోదర్, పెద్దపెల్లి మాజీ గ్రంథాలయ చైర్మన్ రఘువీర్ సింగ్ ఉన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి



కొండ్రికర్లలో బ్రిడ్జి పరిశీలిస్తున్న నర్సింగరావు

మెట్‌పల్లిరూరల్: నియోజకవర్గ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. మెట్‌పల్లి మండలం కొండ్రికర్లలో బుధవారం ఆయన పర్యటించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. కొండ్రికర్ల శివారులోని వాగుపై వంతెన నిర్మాణానికి రూ.6.80 కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు వంతెన నిర్మాణం చేయిస్తామని చెప్పి మాట తప్పాయన్నారు. నిధులు మంజూరు చేసిన సీఎం, మంత్రి సీతక్క, నర్సింగరావు చిత్రపటాలకు గ్రామస్తులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్ రెడ్డి, నాయకులు అల్లూరి రాజేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సురేశ్, తిరుపతిరెడ్డి, కాశీం, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం వెల్దుర్తి గ్రామానికి చెందిన బందెల పవిత్ర (31) పురుగుల మందు తాగగా.. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. పవిత్ర కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. జీవితంపై విరక్తి చెంది ఈనెల 23న మధ్యాహ్నం గడ్డి మందుతాగింది. కుటుంబ సభ్యులు గమనించి జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యులు చికిత్స అందించినా ఫలితం లేకుండాపోయింది. పవిత్ర భర్త బందెల రాజశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు.

అనారోగ్యంతో మాజీ కౌన్సిలర్..

కోరుట్ల: మాజీ కౌన్సిలర్ బోయిని గంగుబాయి (88) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. 2005–10 సంవత్సరంలో ఆమె కౌన్సిలర్‌గా పనిచేశారు. ఆమె మృతితో స్థానికంగా విషాదం నెలకొంది. బోయిని గంగుబాయి మృతిపై కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ జువ్వాడి నర్సింగరావు సంతాపం వ్యక్తం చేశారు.

ఇసుక డంపులు సీజ్

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం ఆత్మకూర్ గ్రామ శివారు ప్రాంతంలో నిల్వ ఉంచిన ఇసుక డంపులను బుధవారం రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. వాగు నుంచి ఇసుక తీసి పెద్ద ఎత్తున్న డంపు చేస్తున్నారనే సమాచారంతో రెవెన్యూ అధికారులు దాడి చేసి 100 ట్రిప్పుల ఇసుకను సీజ్ చేశారు. దాడిలో మెట్‌పల్లి తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ ఉమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

సారంగాపూర్: ఆదిలాబాద్ నుంచి సారంగాపూర్ మీదుగా జగిత్యాలకు తరలిస్తున్న గంజాయిని బుధవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై దత్తాద్రి కథనం ప్రకారం జగిత్యాల మండలం తారకరామానగర్‌కు చెందిన షేక్ రఫీక్ అనే యువకుడు ఆదిలాబాద్ జిల్లా కంబుగూడ గ్రామానికి చెందిన మార్వాతి కాకా నుంచి 1.35 కిలోల (గ్రాములు) గంజాయిని కొనుగోలు చేసి ద్విచక్రవాహనంపై తీసుకు వస్తుండగా, మండలంలోని బట్టపల్లి క్రాస్‌రోడ్డు పోలీసులు తనిఖీ చేయగా రఫీక్ నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి బైకు, సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని రఫీక్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మెట్‌పల్లిరూరల్: గంజాయితో పట్టుబడ్డ యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్ తెలిపారు. మేడిపల్లి శివారులోని క్రాసింగ్ వద్ద బుధవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా, ఖానాపూర్‌కు చెందిన బోదాసు రాము వద్ద 120 గ్రాముల గంజాయి లభించిందన్నారు. నిందితుడు రాముపై కేసు నమోదు చేశామని తెలిపారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కథలాపూర్: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో 2014–15లో పదోతరగతి పూర్తిచేసిన పూర్వ విద్యార్థులు కథలాపూర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు పాఠాలు చెప్పిన గురువులను సన్మానించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆడుతూ పాడుతూ ఆనందోత్సవాల మధ్య గడిపారు. కార్యక్రమంలో టీచర్లు భూమయ్య, రవికుమార్, ప్రణయ్, వెంకటస్వామి పాల్గొన్నారు.

జీవితంలో యోగాను భాగం చేసుకోవాలి

పెగడపల్లి: నిత్య జీవితంలో యోగాను భాగం చేసుకుంటే ఆరోగ్యం సంపూర్ణంగా ఉంటుందని శ్రీవేద యోగ శిక్షణ కేంద్రం నిర్వాహకులు, యోగా గురువులు గంగయ్య, కిశోర్ అన్నారు. మండల కేంద్రంలోని రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో నాలుగు రోజుల పాటు నిర్వహించే ఉచిత యోగా శిక్షణ తరగతులు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాత్విక ఆహారం తీసుకుంటూ నిత్యం గంట పాటు యోగా ఆసనాలను చేయడం ద్వారా అనారోగ్య సమస్యలు దూరమై, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఉచిత యోగా శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జుంబా డ్యాన్స్ ట్రైనర్ రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత

రాయికల్: మండలంలోని బోర్నపల్లి గ్రామానికి చెందిన రాగుల రచన, సాయిరాంలకు మాజీ మంత్రి జీవన్‌రెడ్డి చొరవతో సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు పంపిణీ కాగా, బుధవారం పార్టీ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు కొడిపల్లి ఆంజనేయులు వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఉప్పు లక్ష్మణ్, నరేశ్ పాల్గొన్నారు.

కోటేశ్వర స్వామి ఆలయంలో వేలం పాట

వెల్గటూర్: మండలంలోని కోటిలింగాల దేవాలయంలో బుధవారం దేవాదాయశాఖ పర్యవేక్షకులు రాజమౌళి ఆధ్వర్యంలో నిర్వహించిన వేలం పాటలో రూ.12.25 లక్షల ఆదాయం సమకూరినట్లు దేవస్థానం ఈవో కాంతారెడ్డి తెలిపారు. కొబ్బరికాయలు, పూజా సామాగ్రి అమ్ముకొనుటకు 89,500, కొబ్బరి ముక్కలు పోగు చేసుకునేందుకు రూ.70 వేలు కోటి లింగాలకు చెందిన రాపాక కొమురయ్య దక్కించుకున్నాడు. అదే విధంగా లడ్డూ ప్రసాదాల విక్రయాలకు 2,80,000 మొత్తం 12.45 లక్షల భారీగా ఆదాయం సమకూరినట్లు తెలిపారు.

కేబుల్ ఆపరేటర్లతో సమావేశం



మాట్లాడుతున్న అధికారులు

ధర్మపురి: పట్టణంలోని విద్యుత్ సబ్ స్టేషన్లో బుధవారం ఇంటర్‌నెట్, డిష్ కేబుల్ ఆపరేటర్లతో జిల్లా విద్యుత్ శాఖ డీఈ రాజిరెడ్డి, సింధూశర్మ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ఆపరేటర్లకు పలు సూచనలిచ్చారు. కొత్తగా ఏర్పాటు చేసిన పోల్స్‌తో పాటు పాత పోల్స్ మొత్తం లెక్కించి వాటి ప్రకారం కార్యాలయంలో చార్జీలు చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ధర్మపురి, వెల్గటూర్, ఎండపెల్లి, బుగ్గారం మండలాలకు చెందిన కేబుల్ ఆపరేటర్లు, ఏఈలు, ఆపరేటర్లు పాల్గొన్నారు.

పిచ్చిమొక్కలు తొలగింపు



కథలాపూర్: మండలంలోని చింతకుంట- దుంపేట రూట్‌లో చింతకుంట గ్రామ శివారులో విద్యుత్ స్తంభాల పక్కన ఉన్న పిచ్చిమొక్కలను ట్రాన్స్‌కో సిబ్బంది బుధవారం తొలగించారు. ఈనెల 28న సాక్షి దినపత్రికలో విద్యుత్ స్తంభాల చుట్టూ పిచ్చిమొక్కలు అనే ఫొటో స్టోరీ ప్రచురితమైంది. స్పందించిన ట్రాన్స్‌కో ఏఈ దివాకర్‌రావు సిబ్బందితో పిచ్చిమొక్కలను తొలగింపజేశారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

జీవో ఇచ్చాకే ఎన్నికలు నిర్వహించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న బీసీ నాయకులు

జగిత్యాలటౌన్: బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేస్తూ జీవో విడుదల చేశాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని లేని పక్షంలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు చేపడతామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముసిపట్ల లక్ష్మీనారాయణ హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్‌లో బీసీ నాయకులతో సమావేశమై మాట్లాడారు. 42శాతం బీసీ రిజర్వేషన్ అమలు అంశాన్ని కేంద్రంపైకి నెట్టి వేసి రాష్ట్ర ప్రభుత్వం దాటవేసే ధోరణితో వ్యవహరిస్తుందని ఆరోపించారు. కేంద్రంపై ఒత్తిడి పెంచి 42 శాతం రిజర్వేషన్ అమలు చేశాకే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ఎలుక భగవాన్ యాదవ్, నాయకులు కొక్కు గంగాధర్, తిరుపురం రాంచందర్, బండపెల్లి మల్లేశ్వరి, రాపర్తి రవి, దండుగుల వంశీ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల వేధింపులు ఆపాలి

జగిత్యాలటౌన్: ఫెయిర్ పెయిడ్ పేరిట కండక్టర్లను, కెఎంపీఎల్ పేరిట డ్రైవర్లను వేధించడం ఆపాలని తెలంగాణ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు రాజయ్య డిమాండ్ చేశారు. బుధవారం యూనియన్ కార్యాలయంలో సమావేశం నిర్వహించిన నాయకులు నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ జిల్లా అధ్యక్షుడిగా వి ప్రసాద్, కార్యదర్శిగా కె సురేష్, కోశాధికారిగా కె స్వామి, ప్రచార కార్యదర్శిగా ఆర్ గోపిని ఎన్నుకున్నారు. మహాలక్ష్మి పథకం అమలులోకి వచ్చినప్పటి నుంచి కార్మికులపై విపరీతమైన పని ఒత్తిడి పెరిగిందన్నారు. సమావేశంలో అంజిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

జగిత్యాలఅగ్రికల్చర్/ మల్యాల/మేడిపల్లి: పంటలపై అధికంగా పురుగుమందులను వాడటంతో మనుషుల ఆరోగ్యం దెబ్బతింటుందని వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తలు అన్నారు. జగిత్యాల రూరల్ మండలంలోని కల్లెడ, మల్యాల మండలం రాంపూర్, భీమారం మండలంలోని మన్నెగూడెం గ్రామాల్లో రైతు ముంగిట్లోకి శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. రసాయన ఎరువుల వాడకం, యూరియా నియంత్రణ, అధిక దిగుబడి, రైతుల సమస్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్లు డాక్టర్ బి. సౌజన్య, బి.రాణి, శాస్త్రవేత్తలు డాక్టర్ ఇ.రజనీకాంత్, డాక్టర్ ఎన్.సాయినాథ్, శ్రీనివాస్, రజినీదేవి, ఏవోలు, ఏఈవోలు పాల్గొన్నారు.

▸ గోవధ చేపట్టొద్దని వినతి

ధర్మపురి: 2007 జీవో ప్రకారం ధర్మపురి పుణ్యక్షేత్రంలో అన్యమతం, గోవధ పై నిషేధం విధించాలని వీహెచ్‌పీ నాయకులు బుధవారం మున్సిపల్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. బక్రీద్ సందర్భంగా ధర్మపురిలో గోవధ చేపట్టకుండా చూడాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో నాయకులు దుర్గాప్రసాద్, కస్తూరి రాజన్న, మ్యాన పూర్ణచందర్, ముత్యపు రమేశ్, వైకుంఠం పాల్గొన్నారు.

▸ విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు ప్రారంభం

కథలాపూర్: మండలంలోని పోసానిపేట, సిరికొండ గ్రామాల్లో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ల పనులను బుధవారం ట్రాన్స్‌కో కన్‌స్ట్రక్షన్ డీఈ గోపికృష్ణ ప్రారంభించారు. ఒకొక్క సబ్‌స్టేషన్‌కు ప్రభుత్వం రూ. 2.20 కోట్లు మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో ఏడీఈ కన్‌స్ట్రక్షన్ రాజబ్రహ్మచారి, ట్రాన్స్‌కో కోరుట్ల, మెట్‌పల్లి ఏడీఈలు రఘుపతి, మనోహర్, ఏఈలు దివాకర్‌రావు, భూమేశ్వర్, మునిందర్ రెడ్డి, సహకార సంఘం చైర్మన్ కందరి జీవన్‌రెడ్డి, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

▸ జీపీ కార్మికుల పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

జగిత్యాలటౌన్: మల్టీపర్పస్ వర్కర్లతో పాటు పంచాయతీ కార్మికుల పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, కార్మికులకు గుదిబండగా మారిన జీవో 51ని రద్దు చేసి పాత కేటగిరీలను పునరుద్ధరించాలని సీఐటీయూ అనుబంధ పంచాయతీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కోమడి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. మల్టీపర్పస్ వర్కర్లతో పాటు కార్మికుల పేర్లు ఆన్‌లైన్లో నమోదు చేయాలని, పెండింగ్ వేతనాలు చెల్లించాలని, మల్టిపర్పస్ విధానం రద్దు చేయాలని కోరుతూ బుదవారం జీపీ కార్మికులు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. అనంతరం తమ సమస్యలపై డీపీవో మదన్‌మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పులి మల్లేశం, మహిళా నాయకురాలు న్యాతరి మల్లవ్వ, కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.

▸ అభివృద్ధి పనుల పరిశీలన

మల్లాపూర్: ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ప్రత్యేక చొరవతో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని మాజీ జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మల్లాపూర్ మండల కేంద్రంలోని దుర్గమ్మ కాలనీలో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు, సైడ్‌డ్రైన్ నిర్మాణ పనులను బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ముద్దం శరత్‌కుమార్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బండి లింగస్వామి, నాయకులు పాల్గొన్నారు.

▸ బాధ్యతలు స్వీకరణ

కోరుట్ల: కోరుట్ల నూతన తహసీల్దార్‌గా కృష్ణ చైతన్య బుదవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఇట్యాల కిషన్ గత రెండు నెలల క్రితం కలెక్టర్ కార్యాలయానికి బదిలీపై వెళ్లగా డిప్యూటీ తహసీల్దార్ ఫరూక్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా వ్యవహరిస్తున్నారు. ధర్మపురి తహసీల్దార్‌గా పని చేస్తున్న కృష్ణ చైతన్య కోరుట్లకు బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టారు.

▸ మహమ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు తగవు

కోరుట్ల: మహమ్మద్ ప్రవక్తపై యూ ట్యూబర్ చిలుక ప్రవీణ్ చేసిన వ్యాఖ్యలు సరికావని ముస్లిం నాయకులు అన్నారు. ఈ మేరకు చిలుక ప్రవీణ్‌పై ముస్లింలు కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో బుదవారం ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో జామితే ఐలే హదీస్ పట్టణ కమిటీ సభ్యులు అన్వర్ సిద్దిఖీ, ఫారుక్, అలీం, మీర్జా, బాబా, తదితరులు పాల్గొన్నారు.

▸ నేడు అల్లీపూర్‌లో వైద్య శిబిరం

రాయికల్: మండలంలోని అల్లీపూర్‌లో జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు శంషేర్, నిర్వాహకులు ఇలియాస్ ఖాన్ తెలిపారు. ఈ వైద్య శిబిరంలో పిల్లల వైద్యులు డాక్టర్ శశికాంత్ రెడ్డి, స్త్రీ వైద్య నిపుణులు రజిత, రమేశ్, ప్రశాంత్ వైద్యులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.